క్లుప్తంగా

గుడితండా జీపీ రికార్డుల పరిశీలన



రాజంపేట: గుడితండా జీపీ కార్యాలయాన్ని బుధవారం డీఎల్‌పీవో శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలోని రికార్డులను పరిశీలించారు. గ్రామంలో పారిశుధ్య పనులు నిరంతరం చేపట్టాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా వందశాతం ఇంటి పన్ను వసూలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి నవీన్‌ను ఆదేశించారు. ఎంపీడీవో రఘురాం ఉన్నారు.

పరీక్షలకు సన్నద్ధం కావాలి



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రిన్సిపల్ అసద్ షారుక్‌తో కలిసి కళాశాలలోని ప్రతి తరగతి గది తిరుగుతూ విద్యార్థులను ప్రశ్నలు అడిగారు. విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. అనంతరం అధ్యాపకులతో కలసి మీటింగ్ ఏర్పాటు చేశారు. కళాశాల రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

యువత క్రీడల్లో రాణించాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): యువత క్రీడల్లో రాణించాలని ఎస్సై మహేందర్ ఆకాంక్షించారు. బుధవారం కాటేపల్లిలో ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడలకు సమయం కేటాయించి, ఉన్నత స్థాయికి చేరుకొని తల్లిదండ్రులకు గ్రామాలకి మంచి పేరు తేవాలని సూచించారు. ఎంఈవో ప్రవీణ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు మల్లప్ప పటేల్, మొగుల గౌడ్, రామాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక రుణాల మంజూరుకు కృషి చేయండి



ఎల్లారెడ్డిరూరల్: సొసైటీల ద్వారా దీర్ఘకాలిక రుణాల మంజూరుకు పాలకవర్గం కృషి చేయాలని రైతులు కోరారు. బుధవారం ఎల్లారెడ్డి సొసైటీ చైర్మన్ నర్సింలు అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. సొసైటీకి సంబంధించిన లావాదేవీల వివరాలను కార్యదర్శి విశ్వనాథం చదివి వినిపించారు. రైతులకు దీర్ఘకాలిక రుణాలు మంజూరయ్యేలా తీర్మానం చేశారు. సొసైటీల విభజన జరగనుండటంతో భిక్కనూర్‌లో కొత్త సొసైటీ ఏర్పాటుకు పాలకవర్గం ఆమోదం తెలిపింది. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, డైరెక్టర్లు సుకేందర్‌రెడ్డి, ప్రకాష్, నారాయణ, గోపి తదితరులున్నారు.

బీడీవర్కర్స్ కాలనీలో ఓపెన్ ప్లాట్ల రద్దుకు చర్యలు

బాన్సువాడ రూరల్: మండల కేంద్రంలోని బీడీ కార్మికులకు గతంలో ఇంటి స్థలాలు కేటాయించారు. చాలా మంది ఇళ్లు నిర్మించుకుని బీడీ వర్కర్స్ కాలనీ ఏర్పాటు చేసుకున్నారు. కాలనీలో పలు అభివృద్ధి పనులు కూడా కొనసాగాయి. కాగా ఇళ్ల స్థలాలు పొందిన వారిలో కొంత మంది ఎలాంటి ఆవాసం ఏర్పాటు చేసుకోలేదు. దీంతో చాలా ఏళ్లుగా ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి. నిబంధనల ప్రకారం ఖాళీగా ఉన్న వాటి పట్టాను రద్దు చేయడానికి తదుపరి చర్యలు తీసుకుంటామని బాన్సువాడ తహసీల్దార్ వరప్రసాద్ తెలిపారు.

శాంతి భద్రతలు కాపాడాలి



భిక్కనూరు: మండల ఎస్సైగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆంజనేయులను భిక్కనూరు ప్రైవేట్ వైద్యుల సంఘం తరఫున బుధవారం సన్మానించారు. ప్రజలకు సేవలు అందించి శాంతి భద్రతలను కాపాడాలని వైద్యులు ఎస్సైని కోరారు. కార్యక్రమంలో ప్రైవేట్ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సత్యనారాయణ, ప్రతినిధులు సుదర్శన్, గంగాధర్, గొల్ల రమేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

మేము ఎదురుదాడులకు దిగితే..

- కాంగ్రెసోళ్లు ఇంట్లో నుంచి బయటికి కూడా రాలేరు
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి



బాన్సువాడలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు



సదాశివనగర్‌లో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): బీజేపీ కార్యాలయంపై దాడిని నిరసిస్తూ తాము ఎదురుదాడికి దిగితే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వాళ్లు ఇంట్లో నుంచి బయటకు కూడా రాలేరని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు దాడి చేయడం సిగ్గుచేటని అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. మళ్లీ ఇలాంటి దాడులు పునరావృతం అయితే ప్రతిదాడులు తప్పవని హెచ్చరించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ రావు, మండలాధ్యక్షుడు రాంరెడ్డి, ప్రధానకార్యదర్శి భూంరావు, ఉపాధ్యక్షుడు చక్రధర్ గౌడ్, ఓబీసీ మోర్చా, ఎస్టీ మోర్చా అధ్యక్షులు రమేశ్, చందర్ నాయక్, కిసాన్ మోర్చా నాయకులు సాయిలు, జైపాల్ రెడ్డి, నల్ల సత్యం రెడ్డి, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

బాన్సువాడ: హైదరాబాద్‌లో బీజేపీ కార్యాలయంపై, కార్యకర్తలపై దాడి చేసిన కాంగ్రెస్ కార్యకర్తలను వెంటనే అరెస్ట్ చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం బాన్సువాడ బీజేపీ కార్యాలయంలో వారు మాట్లాడారు. బీజేపీ కార్యకర్తలు ఎదురు తిరిగితే కాంగ్రెస్ నాయకులు రోడ్లపై కనపడరని అన్నారు. నాయకులు శంకర్‌గౌడ్, ప్రసాద్, చిరంజీవి, డిష్ ప్రసాద్, అశ్విన్, శివశంకర్, భూమేష్ తదితరులున్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

అధ్యాపకుల సంఘం..



కామారెడ్డి అర్బన్: తెలంగాణ ప్రభుత్వ అధ్యాపకుల సంఘం(359) క్యాలెండర్‌ను బుధవారం కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నీలం నర్సింలు, ప్రధాన కార్యదర్శి టి.రమేష్‌రావు, వర్కింగ్ అధ్యక్షుడు ఎం.రమేష్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల భరత్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం..



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్లను సంఘం నాయకులు బుధవారం ఆవిష్కరించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు యాదయ్య, మాణిక్యంలు క్యాలెండర్లను ఆవిష్కరించారు.

ఉద్యోగుల సంక్షేమానికి కృషి



కామారెడ్డి టౌన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో ఐకేపీ– వీవోఏ ఉద్యోగుల సంక్షేమ సంఘం క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులకు సమయానికి వేతనాలు అందని పరిస్థితులు ఉండేవని.. ఇప్పుడు ప్రతి నెలా 1న వేతనాలు ఖాతాలో జమవుతున్నాయన్నారు. మున్సిపల్ తరఫున ఐకేపీ ఉద్యోగులకు అన్ని విధాలా సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డితో కలిసి క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. వీవోఏ ఉద్యోగుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పఠాన్ గౌస్ ఖాన్, జిల్లా అధ్యక్షుడు మనోజ్, నాయకులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భిక్కనూరు: మండల కేంద్రంలో గురువారం అరగంట పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ సంకీర్తు బుధవారం తెలిపారు. మండల కేంద్రంలోని 33 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేస్తున్నందున గురువారం ఉదయం ఏడు గంటల నుంచి ఏడున్నర వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

భారతీయ కిసాన్ సంఘ్ సమావేశం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): జిల్లా కేంద్రంలో గురువారం ఉదయం 11 గంటలకు భారతీయ కిసాన్ సంఘ్ పదాధికారుల సమావేశం నిర్వహించనున్నట్లు బీకేఎస్ మండల అధ్యక్షుడు కొప్పుల నర్సారెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి అన్ని మండలాల నుంచి అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు హాజరవుతారన్నారు.

విశ్రాంత ఎంఈవో మృతి



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణానికి చెందిన విశ్రాంత ఎంఈవో వై.జయలక్ష్మి (77) మంగళవారం సాయంత్రం మృతి చెందారు. బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. పలువురు ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు నివాళులర్పించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత



పిట్లం(జుక్కల్): స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం పోగొట్టుకున్న సెల్ ఫోన్‌లను సీఐఈఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితులకు ఎస్సై రాజు అందజేశారు. రెండు సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు అందించారు. ఎవరైనా ఫోన్లు పోగొట్టుకుంటే ఫిర్యాదు చేయాలని ఎస్సై సూచించారు.

కూలిన కల్వర్టులో దిగబడిన కారు



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో ఊరడమ్మ గల్లీలో కూలిన కల్వర్టులో మంగళవారం కారు దిగబడింది. కల్వర్టు కొంత భాగం ఇదివరకే కూలిపోయి ప్రమాదకరంగా మారింది. డ్రైవర్ గమనించకపోవడంతో కారు దిగబడిపోయింది. కల్వర్టు ప్రమాదకరంగా మారినా పంచాయతీ అధికారులు మరమ్మతుల గురించి పట్టించుకోడం లేదని స్థానికులు చెబుతున్నారు. కల్వర్టు గురించి తెలియక చాలా మంది ద్విచక్రవాహదారులు పడిపోయి గాయాలపాలయ్యారని, పంచాయతీ అధికారులు స్పందించి త్వరగా మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అవసరం మేరకు యూరియా వేయాలి



బాన్సువాడ రూరల్: వరి సాగులో అవసరం మేరకే యూరియా వాడాలని కొల్లూర్ క్లస్టర్ ఏఈవో కావ్యశ్రీ సూచించారు. బుధవారం ఆమె కొల్లూర్, వాసుదేవుపల్లి శివార్లలో రైతులను కలిసి పలు సూచనలు చేశారు. పైరులో నత్రజనిని 3, 4 దఫాలుగా వాడాల్సి ఉంటుందన్నారు. యూరియా వేసేటప్పుడు తేమ ఉండాలన్నారు. నాట్లు వేసేటప్పుడు పిలకదశలో, చిరుపొట్ట దశలో యూరియా వేయాలన్నారు. యూరియాను ఎక్కువ మోతాదులో వాడితే చీడపీడలను ఆకర్షిస్తుందని, పెట్టుబడులు అధికమవుతాయన్నారు.

పంటకు చీరలే శ్రీరామ రక్ష



రామారెడ్డి: పంటలను రక్షించుకోవడానికి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. రామారెడ్డి గ్రామంలోని కట్టె డిపో అటవీ ప్రాంతం శివారులో పంటలేసే రైతులు అడవి జంతువుల నుంచి పంటలు రక్షించుకోవడం కష్టంగా మారింది. దీంతో పంటల చుట్టూరా స్తంభాలను ఏర్పాటు చేసి వాటికి చీరలను చుట్టి ప్రహరీ గోడలా పెట్టుకుంటున్నారు. నిత్యం శబ్దాలు వచ్చే విధంగా మ్యూజిక్ సౌండ్లను ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అడవి జంతువుల భారీ నుంచి పంటలను రక్షించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నామని రైతు రాజయ్య తెలిపారు.

ఆర్ట్స్ కళాశాలలో అలరించిన పతంగుల పండుగ



కామారెడ్డి అర్బన్: సంక్రాంతి సందర్భంగా పతంగుల పండుగ(గాలిపటాలు) మన సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దం పడుతాయని, గాలిపటాలు ఎగురవేసే వారికి ఆనందంతో పాటు ఏకాగ్రతను పెంచుతాయని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం సాయంత్రం కళాశాల ఆవరణలో గాలిపటాల ఎగురవేత పోటీలు నిర్వహించారు. గాలిపటాలను ఎగురవేసిన విద్యార్థులకు బహుమతులు అందించారు. వైస్ ప్రిన్సిపాల్ కె.కిష్టయ్య, అకడమిక్ సమన్వయకర్త విశ్వప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి



లింగంపేట: కాంగ్రెస్ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ సూచించారు. బుధవారం ఆయన మోతె గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరూ ఐక్యంగా ఉండి సత్తా చాటాలన్నారు. పార్టీ బలపర్చిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో మోతె మాజీ సర్పంచ్ రాంరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు రాజు, నగేష్, బైరయ్య, భాస్కర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి



కళాశాలలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు



నస్రుల్లాబాద్‌లో..

కామారెడ్డి టౌన్: సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని కామారెడ్డి సైబర్ కానిస్టేబుల్ ప్రవీణ్ అన్నారు. సైబర్ జాగృత దివస్ సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. డిజిటల్ అరెస్ట్, ఏపీకే ఫైళ్లు, బ్యాంకుల పేరిట నకిలీ కాల్స్, పెట్టుబడి మోసాలు తదితర అంశాల గురించి వివరించారు.

ఒక మోసపోతే గంట లోపు స్థానిక పోలీసులను సంప్రదిస్తే ప్రయోజనం ఉంటుందని చెప్పారు. వెంటనే 1930కు కాల్ చేయాలన్నారు. సైబర్ ఉమెన్ హెడ్ కానిస్టేబుల్ రోజా, కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నస్రుల్లాబాద్ సంతలో..

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలో బుధవారం జరిగిన సంతలో పోలీసులు ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోజు రోజుకు నేరగాళ్లు పేట్రేగి పోతున్నారన్నారు. చైన్ స్నాచింగ్, సైబర్ క్రైమ్‌లు ఎలా జరుగుతున్నాయో వివరించారు. అనుమానిత వ్యక్తులు తిరిగితే వెంటనే సమాచారం అందించాలన్నారు. పోలీసులు దేవ సహాయం, జావిద్, మాటిన్ తదితరులున్నారు.

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం



నిజాంసాగర్(జుక్కల్): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో హస్తం జెండాను ఎగురవేస్తామని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బలోపేతంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను గడప గడపకు తీసుకు వెళ్తున్నామన్నారు. ఆయన వెంట పిట్లం ఏఎంసీ చైర్మన్ చీకోటి మనోజ్ పటేల్ ఉన్నారు.

నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు



కామారెడ్డి టౌన్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించకుంటే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ చౌరస్తాలో వాహనదారులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. డ్రైవింగ్ చేసే సమయంలో వాహనదారులు తమ వద్ద అన్ని ధ్రువపత్రాలు ఉంచుకోవాలన్నారు. ఈ పట్టణ ట్రాఫిక్ ఎస్సై మహేష్, కానిస్టేబుల్ హరీష్, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహించడం అభినందనీయం



విజేతలతో అతిథులు, నిర్వాహకులు

కామారెడ్డి రూరల్: పర్యావరణాన్ని పరిరక్షించాలని, అందరికీ అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో వింటర్ గ్రీన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని మున్సిపల్ కౌన్సిలర్లు కాసర్ల గోదావరి స్వామి, పోలీస్ కృష్ణాజీరావు అన్నారు. దేవునిపల్లి కాసర్ల విహార్ రవీందర్ బ్యాడ్మింటన్ కోర్టులో కాసర్ల రాజయ్య స్మారకార్థం నిర్వహించిన వింటర్ గ్రీన్ బ్యాడ్మింటన్ టోర్నీకి ముఖ్య అతిథిగా మున్సిపల్ కౌన్సిలర్లు కాసర్ల గోదావరి స్వామి, పోలీస్ కృష్ణాజీరావు, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కాసర్ల రవీందర్, ఆర్య క్షత్రియ సంఘం నాయకుడు పెద్దోళ్ల శశిధర్‌రావు విచ్చేసి మాట్లాడారు. ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, బాధ్యతగా మొక్కలను పెంచాలని సూచించారు. గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

ఆధ్యాత్మికం

ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి



భిక్కనూరు: మండల కేంద్రంలోని అతి పురాతనమైన వేంకటేశ్వరాలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం కోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉదయం ఐదు గంటలకు స్వామి వారికి అభిషేకంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు.

ఇల్చిపూర్ సరస్వతి ఆలయంలో..



కామారెడ్డి రూరల్: పట్టణ పరిధిలోని ఇల్చిపూర్ సరస్వతి ఆలయం, లింగాపూర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఈ నెల 10న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఉత్తర ద్వారం నుంచి ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారిని, వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవచ్చని ఆలయాల అర్చకులు దత్తాద్రిశర్మ, రవికాంత్, సరస్వతి ఆలయ నిర్మాణదాత పార్శి విఠల్ పటేల్, వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రతినిధి కొమిరెడ్డి నారాయణ తెలిపారు. అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

ఉత్సవాలకు లక్ష్మీనారాయణస్వామి ఆలయం ముస్తాబు



దోమకొండ: మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయం ఈ నెల 10 నుంచి 13 వరకు జరుగనున్న ఉత్సవాలకు ముస్తాబైంది. 10న వైకుంఠ ఏకాదశి, 11 నుంచి 13వ తేదీ వరకు గోదాదేవి రంగనాయకుల స్వామి కల్యాణ ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు పుర్ర బాపురెడ్డి తెలిపారు. భక్తులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఘన్‌పూర్ పాఠశాలలో మాక్ పోలింగ్



మాక్ పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

మాచారెడ్డి: ఘన్‌పూర్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులు మాక్ పోలింగ్ నిర్వహించారు. ప్రిసైడింగ్ అధికారితో పాటు పోలింగ్ సిబ్బంది, ఏజెంట్లుగా విద్యార్థులు వ్యవహరించారు. అలాగే మిగిలిన విద్యార్థులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి దేవేందర్ రావు మాట్లాడారు. విద్యార్థులకు ఇప్పటి నుంచే ఎన్నికలు, విధులు, పరిపాలనా వ్యవహారాలను అవగాహన కల్పించడానికి మాక్ పోలింగ్ ప్రధాన ఉద్దేశమని అన్నారు. మాచారెడ్డి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకటాచారి, ఘన్‌పూర్ హెచ్‌ఎం శారద, ఉపాధ్యాయులు ఉన్నారు.

సంక్షిప్తం

బూత్ అధ్యక్షుల నియామకం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఉత్తునూర్‌లో బుధవారం బీజేపీ బూత్ కమిటీల అధ్యక్షులను నియమించారు. గ్రామంలోని 12,13 వార్డులకు కిషన్ రావు, చరణ్‌లను నియమించినట్లు బీజేపీ మండలాధ్యక్షుడు రాంరెడ్డి తెలిపారు. మండల కార్యవర్గ సభ్యులు రమేశ్, శక్తికేంద్రం నిర్వాహకులు కయ్యాల రవి, నెమ్లి నర్సింలు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

భిక్కనూరు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కంటి వైద్యుడు రవీందర్ పటేల్ 125 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు, కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి రక్షణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు.

కొనసాగుతున్న చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ జోరందుకుంది. మంగళవారం నాటికి లక్షా 97 వేల 460 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

తాడ్వాయిలో వాహనాల తనిఖీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కామారెడ్డి -ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువీకరణ పత్రాలతో పాటు సీటు బెల్టులు, హెల్మెట్లు ధరించని వారికి జరిమానాలు విధించారు. పెండింగ్ చలానాలు కట్టించారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలను నడిపినట్లయితే కేసులు నమోదు చేసి కోర్టుకు పంపిస్తామని హెచ్చరించారు. చిన్న పిల్లలకు వాహనాలను ఇవ్వవద్దని, ఇచ్చినవారు, నడిపించిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

బూట్ల పంపిణీ

రామారెడ్డి: ఉప్పల్‌వాయి ప్రాథమిక పాఠశాలకు ఉప్పల్‌వాయి గ్రామ రామ్‌దళ్ యూత్ ఆధ్వర్యంలో రూ.10 వేల విలువ బూట్లను 60 మంది విద్యార్థులకు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నర్సింలు, ఇన్‌చార్జి హెచ్‌ఎం లక్ష్మారెడ్డి, చంద్రశేఖర్, స్వాతి, మాల ఉపాధ్యాయ బృందం, రామ్ దళ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడికి నివాళి

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పెద్దోళ్ల శ్యాంరావు అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. శ్యాంరావు విశ్రాంత ఉద్యోగుల సంఘానికి పలు సేవలు అందించారని సంఘం జిల్లా అధ్యక్షుడు నిట్టు విఠల్‌రావు, ప్రధాన కార్యదర్శి గంగాగౌడ్, ప్రతినిధులు పేర్కొన్నారు. నివాళులు అర్పించారు.

కౌమారదశపై విద్యార్థులకు అవగాహన

కామారెడ్డి అర్బన్: వర్ల్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పట్టణ పరిధిలోని లింగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8, 9, 10 తరగతుల విద్యార్థులకు కౌమార దశ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గతంలో బోధించిన అంశాలపై విద్యార్థులకు క్విజ్ నిర్వహించి బహుమతులు అందజేశారు. హెడ్‌మాస్టర్ టి.కమల, ఉపాధ్యాయులు, వర్ల్డ్ ప్రతినిధులు వంశీ కృష్ణ, శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.